# అంపకాలు

**బా**బాయి ఊరుకెళ్తున్నాడంటే ఈసారి చిట్టికెందుకో పట్టరాని దుఃఖం వచ్చింది. పెద్దవాళ్లతో బాటు తనుకూడా కళ్లల్లో వత్తులేసుక్కూచుంది – మామూలుగా దీపాలు పెట్టగానే నిద్రపొయ్యేది. చుట్టు బెల్టులు బిగించిన బాబాయి పరుపు, సర్ది తాళం వేసిన బాబాయి పెట్టె చూస్తూ ఎట్లా నిద్దరపోవటం?

"నేనివాళ పోనమ్మా. రేపు నిద్దర లేచీ, చక్కగా మనిద్దరం మొహం కడుక్కునీ–" అని బాబాయి బుజ్జగిస్తున్న కొద్దీ చిట్టి బాబాయి మెడకు చేతులు పెనేసి, "ఉఁహుఁ! ఉఁహుఁ!" అని తల అడ్డంగా తిప్పుతూ కొంతసేపు మారాం చేసింది.

అమ్మ కోప్పడ్డది.

"బాబాయికి బరువుకాదుటే! చంకదిగు భడవాకానా! దిగుతావా, దిగవా?" అని అమ్మ ఉరిమింది.

నాన్న కూడా కోప్పడ్డాడు.

చిట్టి బావురుమన్నది. దాని కన్నీటితో బాబాయి మొహమంతా తడిసింది. అతనికి ఈ ప్రేమను నమ్మాలో నమ్మరాదో తెలీలేదు. చిట్టాం అదివరకు తనమీద ఇంత ప్రేమ చూపించి ఎరగదు. పోనీ, ఇదంతా వొట్టి మంకుతనం అనుకుందామంటే, ఆ కన్నీళ్లో?

పది కూడా కొట్టింది. ఇక బయలుదేరకపోతే మెయిలందదు.

"ఇక దిగమ్మా. చిట్టీ! నేను మళ్లీ వస్తాగా! నీకు మంచి మంచి బిస్కత్తులూ, పిప్పరమింటు బిళ్లలూ–"

చిట్టాం మళ్లీ బావురుమన్నది. బాబాయి ఇక పట్టలేకపోయినాడు. పిల్లను దగ్గిరికి తీసుకుని కళ్లనీళ్లు తుడిచి, ముద్దులాడి ఆఖరుకు బలవంతాన వదిలించుకుని బయలుదేరాడు. పోతూ, పోతూ "పిల్లనేం అనకమ్మా, వొదినా!" అని హెచ్చరించాడు.

బాబాయి వెళ్లిన పావుగంటదాకా చిట్టి ఏడుపు తిరుగుమొహం కాలేదు. ఆఖరుకు ఏడుపు ఎక్కిళ్లుగానూ, ఎక్కిళ్లు నిద్రలోకీ ఉపశమించింది.

మాటల అలికిడికి చిట్టి మేలుకున్నది కాని కళ్లు తెరవలేదు. అందరూ ఒక్కసారిగా మాట్లాడుతున్నారు. అన్ని గొంతుల్లోనూ బాబాయి గొంతు స్పష్టంగా వినిపిస్తున్నది చిట్టికీ.

"మెయిలు ఏడుగంటలు లేటు. స్టేషన్లో ఉండి ఏమిటి చెయ్యటం? మెయిలు కోసం వచ్చిన వాళ్లంతా ఇళ్లకు తిరిగి వెళ్లారు. మళ్లా ఏ నాలుగింటికో లేచి వెళతాను... చిట్టాం- పిచ్చిముండ! అప్పుడే నిద్రపోయినట్టుందే?" అంటున్నాడు బాబాయి.

"పోయింది ఏడిచీ ఏడిచీ" అని తల్లి జవాబు చెబుతున్నది.

చిట్టికి కళ్లు తెరవాలని ఎంతమాత్రమూ లేదు. బాబాయి మొహం చూడటానికెందుకో సిగ్గేసింది. బాబాయి తిరిగి రావటం చిట్టికిష్టం లేదు. తన దుఃఖమంతా వృథా చేశాడు! తెల్లారు జామున కూడా మళ్లా చిట్టికి మెళుకువ వచ్చింది. కానీ అప్పుడు కూడా చిట్టి నిద్రపోతున్నట్టే కదలకుండా పడుకున్నది.

మళ్లా రైలుకు వెళ్లబోతూ, "చిట్టామను లేపనా?" అన్నాడు బాబాయి నవ్వుతూ. నిజంగా లేపుతాడేమోనని చిట్టికి తగని భయం వేసింది.

"ఇంకా నయం!" అని తల్లనేదాకా చిట్టాం ప్రాణం కుదటపళ్లే.

*ముద్రణ : కవిరాట్టు, అభూత కల్పనలు - గల్పికలు, 1942*
*యువ కార్యాలయం, తెనాలి*